క్లుప్తంగా

మాజీ ఎంపీ శ్రీధర్ ఇంట్లో ఆత్మీయ సమ్మేళనం


మాజీ ఎంపీ నివాసంలో ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు

దెందులూరు: మాజీ ఏలూరు పార్లమెంట్ సభ్యుడు కోటగిరి శ్రీధర్ స్వగ్రామమైన ఈస్ట్ యడవల్లిలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. బుధవారం మాజీ ఎంపీ నివాసంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, కారుమూరి సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, చింతలపూడి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కంభం విజయరాజు, ఏలూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా దేవిడ్‌రాజు


తోట దేవిడ్‌రాజు సన్మానించిన కమిటీ సభ్యులు

దెందులూరు: దెందులూరు ఎస్సీ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా తోట దేవిడ్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎఫ్‌డీఓ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో సొసైటీ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రెసిడెంట్‌గా తోట దేవిడ్ రాజు, వైస్ ప్రెసిడెంట్‌గా బేతాళ పాపారావు, సెక్రటరీగా నేరెళ్ల లాజరు, డైరెక్టర్లుగా యంట్రపాటి నూకరాజు, బత్తిన జయరాజు, గుడిపూడి ఎలీషా, కాకర్ల జాన్‌రాజు, నేతలు ఏసు, తోట రాజు ఎన్నికయ్యారని ఆయన వివరించారు.

టేబుల్ టెన్నిస్‌లో ద్వితీయ స్థానం


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గణపవరం: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల స్థాయిలో నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలలో గణపవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ ఎస్‌కేవీపీ డిగ్రీ కళాశాలలో జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. కళాశాలకు చెందిన అంజన్‌కుమార్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో యూనివర్సిటీ స్థాయి పోటీకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ స్వాతిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

186 మద్యం సీసాలు స్వాధీనం

ఏలూరు టౌన్: ఏలూరు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, ఏలూరు ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఏలూరు రూరల్ ప్రాంతంలో అక్రమంగా మద్యం నిల్వ చేసిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి, భారీగా మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని ఏలూరు ఎక్సైజ్ సీఐ జీఎస్‌కే ధనరాజ్ తెలిపారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్ అధికారి అవులయ్య ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టామని తెలిపారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో 144 మద్యం సీసాలు కలిగిన మరదాని వెంకట రాజారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఏలూరు రూరల్ కలకుర్రులో ఒక వ్యక్తి 20 మద్యం సీసాలు, పెదవేగి మండలం రాట్నాలమ్మకుంటలో మరో వ్యక్తి 22 మద్యం సీసాలు కలిగి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితుల వద్ద నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సీపీఆర్ విధానంపై అవగాహన పెంచుకోండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అత్యవసర పరిస్థితుల్లో మనిషి ప్రాణాన్ని కాపాడటానికి సీపీఆర్ విధానం అత్యంత ప్రధానమైనదని దీని ద్వారా మనిషి ప్రాణాన్ని కాపాడడం మాత్రమే కాకుండా ఒక కుటుంబాన్ని ఆదుకోవడమేనని, ప్రతి ఒక్కరు తప్పకుండా సీపీఆర్ చేసే విధానాన్ని నేర్చుకోవాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సభ్యులు, ప్రముఖ ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ చిన్ని సత్యనారాయణ సూచించారు. నగరానికి చెందిన సీఆర్‌ఆర్ కళాశాల ఎంబీఏ, ఏలూరు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో బుధవారం లైఫ్ సేవింగ్ స్కిల్స్, సీపీఆర్ విధానం, మానసిక ఆరోగ్యం అంశాలపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్ని సత్యనారాయణ పలు అంశాలు వివరించారు. ప్రముఖ మానసిక వ్యాధి నివారణ కన్సల్టెంట్ అక్కింశెట్టి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు.

మోగనున్న పెళ్లి బాజాలు

- అన్నీ శుభ శకునములే.. జోరుగా వివాహాలు
- నవంబర్, డిసెంబర్‌లో అధిక ముహూర్తాలు
- మార్కెట్లో ఎక్కడ చేసినా పెళ్లి సందడే


కనులవిందుగా వివాహ వేదిక (ఫైల్)


అతిథులకు ఆత్మీయ స్వాగతం (ఫైల్)

గణపవరం: వివాహం అనేది ప్రతి వ్యక్తి జీవితంలో ఓ మధురమైన, మరపురాని ఘట్టం. ఆ తీపి జ్ఞాపకాలను అందరూ మెచ్చుకునేలా, పది కాలాలు గుర్తుండేలా జరుపుకోవాలని అందరూ భావిస్తుంటారు. తమ పిల్లల వివాహాలను వైభవంగా నిర్వహించాలని తల్లిదండ్రులు ఆరాట పడుతుంటారు. ఈ నేపథ్యంలో కొన్ని సందర్భాల్లో ముహూర్తాలు లేక నెలల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు ఉంటాయి. అయితే ఈ ఏడాదిలో రానున్న రెండు నెలల కాలంలో మంచి ముహూర్తాలు ఉండటంతో ఎక్కడ చూసినా పెళ్లిళ్ల సందడే కనిపిస్తోంది. దీనితో కల్యాణ మండపాలకు గిరాకీ పెరిగింది, పురోహితులంతా బిజీ అయిపోయారు. ఇక బంగారం, వస్త్రాలు కొనుగోళ్లు పెరగడంతో ఆయా షాపులు కళకళలాడుతున్నాయి. వివాహ వేడుకల్లో ప్రముఖ పాత్ర పోషించే వివిధ వర్గాలు కూడా తీరిక లేకుండా బిజీగా ఉన్నారు. నవంబర్, డిసెంబర్‌ల్లో సుమారు 26 రోజులు మంచి ముహూర్తాలు ఉండటంతో వివాహాలు వేల సంఖ్యలో జరుగనున్నాయని పండితులు చెబుతున్నారు. నవంబర్‌లో 7, 8, 9, 10 ,13, 14, 16, 17, 20, 21, 24వ తేదీల్లో ముహూర్తాలున్నాయి. డిసెంబర్‌లో 4, 5, 6, 7, 8, 11, 12, 14, 15, 18. 20, 22, 25వ తేదీల్లో ముహూర్తాలున్నాయి.

భారీగా వివాహాలు

నవంబర్, డిసెంబర్ నెలల్లో దాదాపు 26 రోజులు శుభ ముహూర్తాలు ఉండటంతో వివాహాలు భారీగా జరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే పట్టణం, పల్లె అనే తేడా లేకుండా కల్యాణ మండపాలన్నీ పెళ్లిళ్ల కోసం బుకింగ్ చేశారు. ఇంకా ముహూర్తాలు పెట్టుకున్నవారు కల్యాణమండపాలు అందుబాటులో లేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఐదారు వేలకు పైగా వివాహాలు జరిగే అవకాశంఉందని అంచనావేస్తున్నారు.

బిజీగా అనుబంధ వ్యాపారాలు

వివాహ వేడుకల్లో ముఖ్యపాత్ర పోషించే అనుబంధ వ్యాపారాలకు గిరాకీ ఏర్పడింది. లైటింగ్, సెట్టింగ్‌లు, ఫొటోగ్రాఫర్లు, బ్యాండు మేళాలు, సన్నాయి మేళాలు, వంట మాస్టర్లు, క్యాటరింగ్ గ్రూపులు, అల్పాహార తయారీదారులు, ఐస్‌క్రీమ్, రకరకాలు డ్రింకులు, కిళ్లీలు అందించే వ్యాపారులంతా ఈ రెండు నెలలు ఊపిరి సలపనంత బిజీగా ఉంటారు.

ఫొటోగ్రఫీకే అగ్రతాంబూలం

వివాహ జ్ఞాపకాలను జీవితాంతం పదిలపరచుకోవడంలో ఫొటోగ్రఫీ పాత్ర ముఖ్యమైనది. మారుతున్న యువతరం అభిరుచులకు అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఫొటోషూట్‌లు, డ్రోన్ల వినియోగంతో వివాహానికి అదనపు హంగులు తెస్తున్నారు. సామాన్య, మధ్య తరగతి వర్గాలు చేసుకునే వివాహాల్లో ఒక్క ఫొటోగ్రాఫర్‌కే ఐదారు లక్షల రూపాయలు చెల్లిస్తున్నారంటేనే దాని ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు.

కళ్లుచెదిరే సెట్టింగ్‌లు

కల్యాణ మండపాల్లో వివాహ వేదికలను లక్షల వ్యయంతో కళ్లుచెదిరేలా భారీ సెట్టింగ్‌లతో అత్యంత సుందరంగా సిద్ధం చేస్తున్నారు. లక్షల్లో అద్దె పలుకుతున్నా కల్యాణ మండలపాల్లో వివాహాలు చేస్తే ఆ అందమే వేరన్న భావనలో తల్లిదండ్రులున్నారు. అందుకే వివాహంలో డబ్బుకు వెరవకుండా భారీగా ఖర్చు చేస్తున్నారు.

మంగళ వాయిద్యాలకూ గిరాకీ

హిందూ సంప్రదాయంలో బాజా భజంత్రీలు లేకుండా వివాహాలను ఊహించలేము. అందుకే వివాహ వేడుకలలో మంగళ వాయిద్యాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. బ్యాండు మేళాల వారు వివాహానికి రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ తీసుకుంటున్నారు. ఇక వివాహాల్లో ఏర్పాటు చేసే సంగీత విభావరులకైతే రూ.లక్ష వరకూ వెచ్చించాల్సిందే.

వచ్చే మార్చి వరకూ ముహూర్తాలు



ఈ ఏడాది మూడు నెలలు మూఢం, మరో నెల శూన్య మాసం కారణంగా అనుకున్నంత మేర వివాహాలు జరుగలేదు. ఇప్పుడు శుభ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటినుంచి వచ్చే మార్చివరకూ వివాహాలు జరిపించేందుకు మంచి ముహూర్తాలున్నాయి. దీంతో భారీ సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే చాలామంది ముహూర్తాలు ఖరారు చేసుకుని వివాహ ఏర్పాట్లుచేసుకుంటున్నారు. మరి కొంత మంది ముహూర్తాల కోసం సంప్రదిస్తున్నారు.

– కాశీభొట్ల వీరవెంకట నాగేశ్వర కృష్ణప్రసాదశాస్త్రి, భీమడోలు, ద్వారకాతిరుమల దేవస్థానం ఆస్థాన సిద్ధాంతి

భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ ఇవ్వండి

భీమడోలు: ప్రముఖ పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమల వెళ్లే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్స్ ఇవ్వాలని బుధవారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఢిల్లీలోని రైల్వే భవన్‌లో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ చైర్మన్, సీఈవో సతీష్‌కుమార్‌ను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఏలూరు జిల్లా పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల కోసం భీమడోలు రైల్వే స్టేషన్‌లో జన్మభూమి, రత్నాచల్, గౌతమి, షిర్డీ వంటి ఎక్స్‌ప్రెస్‌ను నిలుపుదల చేయాలని కోరారు. భీమడోలులో రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆయన సంబంధిత ఉన్నతాధికారిని కోరారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయడం ద్వారా వందలాది భక్తులు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు, విద్యార్థులు మేలు జరుగుతుందని, ప్రయాణ ఇబ్బందులు తొలగిపోతాయని ఆయన కోరారు. ఆయన విజ్ఞప్తి మేరకు ఉన్నతాధికారి సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.

దళిత మంత్రిని అవహేళన చేస్తే సహించం

దెందులూరు: దళిత వర్గానికి చెందిన మహిళా హోంమంత్రి వంగలపూడి అనితను ఉద్దేశించి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవహేళనగా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ దళితులకు రాజకీయ పదవులను పవన్ కల్యాణ్ కట్టబెట్టినట్టు ఆయన ఊహించుకుంటున్నారని, అదేవిధంగా ముందు ఆయనకు కేటాయించిన శాఖను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలకు సేవ చేయాలని నాగమల్లేశ్వరరావు అన్నారు. దళిత రాజకీయ నాయకులను చిన్న చూపు చూస్తూ వ్యాఖ్యనిస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామికి గ్రామోత్సవం



భీమడోలులో గ్రామోత్సవంలో పాల్గొన్న మాలధారులు, ఆకట్టుకున్న పంచఅశ్వ వాహనం

భీమడోలు: లోక క్షేమం, గ్రామ శ్రేయస్సు, దేశాభివృద్ధిని కోరుతూ బుధవారం భీమడోలు గ్రామంలో అయ్యప్ప మాలధారులు స్వామివారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భీమడోలు అయ్యప్ప స్వామి ఆలయంలో పీఠం వద్ద పరిసర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో అయ్యప్ప స్వామి మాలధారులు పూజలు చేస్తున్నారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో మాలధారులంతా ఆలయంలో తెల్లవారు జాము నుంచి పంచామృతాభిషేకాలు, పూజలుచేసారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పంచ అశ్వవాహనంపై అయ్యప్ప ఉత్సవమూర్తిని ఉంచి కేరళ డప్పు వాయిద్యాలతో బాణాసంచా కాల్చుతూ, నృత్యాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గురుస్వామి అల్లూరి రాఘవేంద్రరావు, పీఠానికి చెందిన 200 మంది మాలధారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి అభివృద్ధికి చర్యలు


భీమడోలులో హైవే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణానికి స్థల సేకరణపై సర్వే చేస్తున్న ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్

భీమడోలు: జాతీయ రహదారి 219ఏను అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. జాతీయ రహదారిపై భీమడోలు, కురెళ్లగూడెం, పూళ్ల వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు హైవేలపై ఆర్వోబీ, ఫ్లైఓవర్ వంతెన నిర్మాణాలకు చేపట్టేందుకు అవసరమైన స్థల సేకరణపై బుధవారం తహసీల్దార్ బి.రమాదేవితో కలిసి ఆయన సర్వే చేశారు. హైవే పక్కనే ఉన్న రైల్వే సరిహద్దులను ఆయన పరిశీలించారు. భీమడోలు వద్ద ఒక పక్క రైల్వే స్టేషన్, మరో పక్క గోదావరి కాలువ ఉండడం వల్ల నేషనల్ హైవే అథారిటీ అధికారులకు ఎక్కడైతే ఆర్వోబీ, ఫ్లైఓవర్ నిర్మించేందుకు అనువుగా ఉండే ప్రాంతాన్ని సూచించాలని మండలస్థాయి అధికారులను కోరారు. అక్కడ పరిస్థితులను ఆయన తహసీల్దార్, మండల సర్వేయర్ ధర్మారావు నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రిత్వశాఖను లిఖితపూర్వకంగా కోరానని తెలిపారు. ఈ నేపథ్యంలో రహదారిపై ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, రైల్వే స్టేషన్లు, రైల్వే క్రాసింగ్ లైన్లు గుర్తించామన్నారు. ఫ్లై ఓవర్, ఆర్వోబీలను నిర్మించేలా సంబంధిత నేషనల్ హైవే అథారిటీ అధికారులతో చర్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో వినయ్, గ్రామ సర్వేయర్లు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లై ఓవరు నిర్మాణానికి స్థలాల పరిశీలన

ఉంగుటూరు: ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో జాతీయ రహదారి హద్దులను అధికారులకు రెవెన్యూ అధికారులు చూపించారు. ఈ మేరకు చేబ్రోలు, కైకరం, ఉంగుటూరులో ఫ్లైఓవర్ ప్రదేశాలను హైవే స్పాట్లు పరిశీలించారు. ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఉంగుటూరు తహసీల్దారు పూర్ణచంద్రప్రసాద్, సర్వేయర్ విశ్వనాథం, వీఆర్వోలు, ఇతర రెవెన్యూ అధికార్లు, హైవే అధికార్లు పాల్గొన్నారు.

బియ్యం సరఫరాలో అలసత్వం వద్దు


పాతూరులో గోడౌన్ తనిఖీ చేస్తున్న ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సరఫరాలో అలసత్వం వహిస్తే సహించేది లేదని ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరులోని ఏఎంఎస్ పాయింట్‌ను అయన బుధశారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, బియ్యం, పంచదార, కందిపప్పులను అయన పరిశీలించారు. అక్కడ ఉన్న బియ్యం, పంచదార బస్తాలను ఆయన తూకం వేయించారు. తూకంలో తేడాలు రాకుండా చూసుకోవాలని అయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నేరుగా బియ్యం సరఫరాపై అయన ఆరా తీశారు. రేషన్ సరుకులను ప్రతి లబ్ధిదారుడికి సకాలంలో అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, సీఎస్‌డీటీ కనకదుర్గ, వీఆర్వో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అపార్‌కు ఆధార్ అనుసంధానం వేగవంతం చేయాలి


ఏలూరు కొత్తపేట వార్డు సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న అపార్‌కు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. బుధవారం స్థానిక గాంధీనగర్ నగర బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపార్ (ఆటోమేటెడ్ ఐడీ పర్మినెంట్ అకడమిక్ అక్కౌంట్ రిజిస్టరి) నమోదులో భాగంగా ఇంటర్ వరకు చదువుకున్న ప్రతి విద్యార్థి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆధార్‌లోని వివరాలు, పాఠశాల రిజిస్ట్రేషన్‌లోని వివరాలు, యూ–డైస్ ప్లస్‌లోని వివరాలు ఒకేలా ఉండాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టీని, పాఠశాలలో పారిశుద్ధ్యం,తాగునీరు, మధ్యాహ్న భోజన పథకం తీరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మధ్యాహ్నం భోజన పథకం నాణ్యతా ప్రమాణాలతో విద్యార్థులకు అందజేసే విధంగా ఉపాధ్యాయులు తరచూ భోజనాన్ని తనిఖీ చేస్తుండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.కృష్ణప్రసాద్, మున్సిపల్ కమిషనరు ఎ.భానుప్రతాప్, తహసీల్దారు జీవీ శేషగిరి, డిప్యూటీ కమిషనరు శివారెడ్డి, మున్సిపల్ ఇంజనీరు సురేంద్రబాబు, డీఈ తాతబ్బాయి ఉన్నారు.

వార్డు సచివాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఏలూరు(మెట్రో): ఏలూరు కొత్తపేట ప్రాంతంలోని నగరంలోని 41, 42 డివిజన్లకు సంబంధించిన వార్డు సచివాలయాన్ని బుధవారం కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన విధుల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా సమర్ధవంతంగా ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు వారి పరిధిలో నిర్వహిస్తున్న వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఆరా తీశారు. పన్ను వసూళ్ల తీరును సంబంధిత రిజిస్టర్ ద్వారా పరిశీలించారు. వార్డుల్లో పారిశుద్ధ్యం, వీధి లైట్లు వెలిగేలా సంబంధిత సచివాలయ సిబ్బంది రోజువారీ పర్యవేక్షించాలన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఏలూరు (టూటౌన్): 75 కేజీల బస్తా ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర రూ.1,725 ప్రకటించినా దళారులు రైతుల నుంచి ధాన్యాన్ని 1,400 రూపాయలకే కొనుగోలు చేస్తున్నారని, రైతు పండించే ధాన్యాన్ని పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఏలూరు జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వి. శ్రీలక్ష్మికి ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు, రైతులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 1.80 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 5.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా కాగా ఇందులో 3.40 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేస్తామని లక్ష్యంగా ప్రకటించారని చెప్పారు. రైతులు పండించిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు లక్ష్యంగా ప్రకటించడం వల్ల మిగిలిన పంటను దళారులకు, వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తేమ శాతం నిబంధనలు మార్పు చేయాలని కోరారు. 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు రైతులకు అందించాలన్నారు. నాయకులు కె.జగదీష్, పి.దావీదు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు కోసం 2,340 దరఖాస్తులు

దెందులూరు: మండలంలో పట్టభద్రుల ఎన్నికల ఓటు హక్కు కోసం నాటికి 2,340 దరఖాస్తులు వచ్చాయని దెందులూరు మండలం ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కృష్ణస్వామి అన్నారు.

ప్రధానోపాధ్యాయుడు తోట మృతి బాధాకరం

దెందులూరు: హెచ్‌ఎం తోట వెంకటరత్నకుమార్ బుధవారం ట్రైనింగ్ క్లాసులో గుండెపోటుతో మృతి చెందటం తనతో పాటు ఉపాధ్యాయులందరినీ కలిచివేసిందని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కలపాల సురేష్ అన్నారు. బుధవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ ఉండి మండలానికి చెందిన ఉనుదుర్రు ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేస్తున్న తోట వెంకటరత్నకుమార్ ఆగిరిపల్లి మండలంలో తోటపల్లిలో లీడర్ షిప్ కార్యక్రమంలో పాల్గొని హఠాత్తుగా గుండెపోటు వచ్చి వెంకటరత్న కుమార్ అక్కడికక్కడే మృతి చెందటం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. హెచ్‌ఎం కుటుంబానికి సురేష్ సంతాపం తెలిపారు.

అయ్యప్పస్వామికి అభిషేకం

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అంబటి లక్ష్మణరావు, గంటా సుబ్బారావు, గురుస్వామి పెద్దిశెట్టి నాని, అయ్యప్ప స్వాములు గాలాయగూడెం గ్రామస్తులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. గ్రామస్తులు, భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

క్రాడిల్ సెంటర్ పునరుద్ధరణ


కొత్త బస్టాండులో క్రాడిల్ రిసెప్షన్ సెంటర్‌ను పునరుద్ధరిస్తున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక కొత్త బస్టాండ్‌లో క్రాడిల్ రిసెప్షన్ సెంటర్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ బుధవారం పునరుద్ధరించారు. ఈనెల 7న గర్భస్థ శిశు దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో భాగంగా క్రాడిల్ రిసెప్షన్ సెంటర్, చంటి బిడ్డల తల్లులు పాలిచ్చే గదులను సందర్శించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా వద్దు అనుకున్న బిడ్డలను రోడ్డు పక్కన, కాలవల్లో, చెత్త బుట్టల్లో విడిచి పెట్టకుండా, ఇటువంటి ఉయ్యాలలో విడిచిపెట్టాలని కోరారు. అలాగే పౌరులు బాధ్యత తీసుకుని 1098 లేదా 100, 181 నంబర్లకు ఫోన్ చేసి సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఆ బిడ్డల రక్షణను అధికారులు తీసుకుంటారని, వారిని సంరక్షించడం లేదా చట్ట ప్రకారం దత్తత ఇవ్వడం చేస్తారని తెలిపారు. ఈ క్రాడిల్ రిసెప్షన్ సెంటర్లు కొత్త బస్టాండ్, గవర్నమెంట్ హాస్పిటల్, శిశు గృహాల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ పీ. పద్మావతి, డీసీపీఓ సూర్యచక్రవేణి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


పాలగూడెం సమస్యలపై మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పాలగూడెంలో గ్రామస్తుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో పాలగూడెం సర్పంచ్ పి.సునీత ఆధ్వర్యంలో గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను కలిశారు. స్థానిక సమస్యలు పరిష్కారంలో పడుతున్న ఇబ్బందులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సంబంధిత అధికారులతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. త్వరితగతిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన అన్నారు.

మాజీ ఎంపీ కోటగిరిని కలిసిన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్ళపల్లి జయప్రకాష్ ఈస్ట్ యడవల్లిలో ఆయన నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సమస్యలపై మాజీ ఎంపీ శ్రీధర్‌తో కొఠారు అబ్బయ్యచౌదరి, మామిళ్లపల్లి జయప్రకాష్ చర్చించారు. వారి వెంట వడ్డీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్, మాజీ డైరెక్టర్ ఎం.సూర్యనారాయణ, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, పెదవేగి మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, పార్టీ నాయకులు పండు, ఇస్రాయేలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

భీమడోలు: ఆగడాలలంక ఛానల్ రోడ్డు భోగాపురం వద్ద మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో బైక్ నడుపుతున్న సైదు పవన్ (26) మెడపై తీవ్రగాయమైంది. ప్రాణాప్రాయ స్థితితో ఉన్న పవన్‌ను ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. వివరాల్లోకి వెళ్లితే ఆగడాలలంక గ్రామానికి చెందిన యువకులు సైదు పవన్, మోరు చందు బైక్‌పై భోగాపురం వైపుగా వస్తుండగా మార్గమధ్యంలో ఒక్కసారిగా బైక్ అదుపుతప్పి ఫెన్సింగ్ వైర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పవన్ గొంతు తెగిపోయింది. చందుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో ఏలూరులోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. పవన్ గొంతుకు ఆపరేషన్ చేసినా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు విచారణ చేస్తున్నారు.